ఎరక్కపోయి వచ్చాం.. ఇరుక్కుపోయాం!

- పనులు కావు.. పలుకుబడి లేదు
- రెంటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి
- ఫిరాయింపు ఎమ్మెల్యేల అంతర్మథనం
- పట్టించుకునే వారే లేరని ఆవేదన
- గాంధీ భవన్‌కు పోలేరు.. సీఎంను కలవలేరు
- ముఖం చాటేస్తున్న ప్రభుత్వ పెద్ద
- రాగానే పిలవద్దని వ్యక్తిగత నీడకు హుకుం
- ప్రజల్లో నవ్వులపాలయ్యామని ఓ ఎమ్మెల్యే మనస్తాపం!
- ఇల్లిల్లూ తిరిగి కండువా కప్పి.. ఇప్పుడు కలవకపోవడంపై ఆ పది మంది గుర్రు!

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): 'అధికార పక్షాన ఉంటే.. అనుకున్నది సాధించుకోవచ్చు' అని ఆశపడి గోడ దుంకిన ఎమ్మెల్యేలకు ఆశాభంగమే అయిందా? అటు పనులు చేసుకోలేక.. ఇటు పరువు నిలబెట్టుకోలేక తమ నియోజకవర్గాల్లో ఆ పది మంది తిరగలేకపోతున్నారా? అంటే.. 'అవును' అన్నదే సమాధానం! 'ఇది గ్యారెంటీగా మోసమే.. ప్రజలకు ఇచ్చిన హామీల సంగతేమోగానీ మాకు ఇచ్చిన మాటయితే నిలబెట్టుకుంటరనుకున్నం. అదీ లేదు.. ఇదీ లేదు.. రెంటికీ చెడ్డరేవడిలా మా పరిస్థితి తయారైంది' అని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఓ సీనియర్ ఎమ్మెల్యే వాపోవడం వారి పరిస్థితిని బయటపెడుతున్నది. ఇలా ఒకరిద్దరు కాదు.. పార్టీ మారిన 10 మంది, ఆరుగురు ఎమ్మెల్సీలదీ అదే దుస్థితి అని తెలుస్తున్నది. 'కండువా మారేదాకా వెంటపడ్డరు.. ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకున్నపాపాన పోవటంలేదు' అని వాపోతున్నారు. పార్టీలో చేరిన సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకరిద్దరికి హామీని నిలబెట్టుకున్నా, మిగతా వారికి మొండిచెయ్యే చూపారు. అందరికీ 'అజ్ఞాతబంధువు' ఆశీస్సులు ఉండవు కదా? అని వారే నిట్టూరుస్తున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం అటుంచితే.. కనీసం తమను కలిసేందుకు కూడా ముఖం చాటేస్తున్నారని, పైపెచ్చు 'వీళ్లను ఎప్పుడు పడితే అప్పుడు రానియ్యొద్దని చెప్పిన కదా.. మళ్లీ ఎందుకు రానిస్తున్నరు' అని ప్రభుత్వ పెద్ద తన వ్యక్తిగత నీడకు హుకుం జారీ చేశారని చెప్తున్నారు.

అందరిదీ అదే వరుస..

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్, కాలే యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి ఈ 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయితే, బీఆర్ఎస్‌ను జీరో చేస్తామని, అసలు ఆ పార్టీ అంటూ ఉండదని, ఆ పార్టీలో ఉండి చేసేదేమీ లేదని కాంగ్రెస్‌లో చేరండి అని కాంగ్రెస్ పెద్దలు ఇల్లిల్లూ తిరిగి ఆహ్వానాలు పలికారు. స్వయంగా వీరందరినీ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ చేరుతున్నవారికి ఎదురులేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఎవరి స్థాయిని బట్టి వారి కమిట్‌మెంట్‌కు అనువైన అవకాశం కల్పిస్తానని వాగ్దానం చేసి, కండువా మారిన తెల్లారి నుంచే తమను పట్టించుకోవటం మానేశారని వారు వాపోతున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేరే సమయంలో క్యాబినెట్ మంత్రి హోదాతోపాటు, అన్ని రకాలుగా 'రోజు వారీ' రాయబారాలకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారని, తీరా అమలు విషయానికి వచ్చేసరికి మొదట్లో సూపర్‌హిట్ సినిమాను తలపించినా తర్వాత బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డట్టయిందని ఆయన గుర్రుగా ఉన్నట్టు సన్నిహితులే చెప్తున్నారు. ఇక ఇచ్చిన పదవి విషయంలోనూ 'పండ్లులేని నోటికి వెలగపండు ఇచ్చి కొరుక్కుతినుమన్నట్టే ఉంది' అని ఆయన మథనపడుతున్నట్టు తెలిసింది. చేరిక ఒప్పందంలో కీలక హామీ.. బకాయిలానే ఉన్నదని, ప్రజల ముందు బకరా అయినట్టు పరిస్థితి ఉన్నదని తన సన్నిహితులతో ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే ఆవేదన వెల్లగక్కినట్టు తెలిసింది. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, కడియం శ్రీహరి పరిస్థితి కూడా అధ్వానంగా తయారైందని అంటున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణుల అంశం ఓ వైపు ఇబ్బందిగా మారితే మరోపైపు తమకు సీఎం రేవంత్‌రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వటం లేదని మథనపడుతున్నారు. పైపెచ్చు 'వీళ్లను ఎప్పుడు పడితే అప్పుడు రానివ్వద్దు' అని వీరిలో ముగ్గురిని ఉద్దేశించి వారికి వినపడేలానే పేర్కొనటంతో కంగుతినటం ఆ ఎమ్మెల్యేల వంతు అయిందట! అటు నియోజకవర్గంలో, ఇటు పార్టీలో తమకు ఎలాంటి ప్రాధాన్యత లేక, తాము చేరిన ప్రయోజనం నెరవేరుతుందన్న నమ్మకం లేక పార్టీ మారిన ఎమ్మెల్యేలు ప్రజల్లో కనిపించటం లేదని అంటున్నారు.

హెచ్చరికలో భాగంగానే తిరిగొచ్చే మంతనాలు?

అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కలిసి తాము కాంగ్రెస్‌లో ఇమడలేకపోతున్నామని, తిరిగి బీఆర్ఎస్‌లోకే వస్తామని మంతనాలు సాగించిన విషయం బయటికి పొక్కింది. మీడియాలో ఆ భేటీ పతాకస్థాయి కావడంతో పరిస్థితిని పసిగట్టిన సీఎం, మంత్రి జూపల్లి కృష్ణారావును రంగంలోకి దింపి కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి రాయబేరం నెరపటంతో అప్పటికప్పుడు ఘర్‌వాపసీకి బ్రేకులు పడ్డాయి. ఇదే అదనుగా పార్టీ మారిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు అల్టిమేటం జారీ చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నపళంగా రంగంలోకి దిగి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో 'కిం కర్తవ్యం' భేటీ నిర్వహించారు. ఫలితంగా ఒకరిద్దరికి పదవులు దక్కినా అవీ 'గురువు' ఆదేశాలతోనేననే ప్రచారం జరుగుతున్నది.

ముందు నుయ్యి వెనుక గొయ్యి..

పార్టీ మారిన ఎమ్మెల్యేల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. గాంధీభవన్‌కు వెళ్లలేరు.. సీఎంను నేరుగా కలువలేరు అన్నట్టు తయారైంది. జగిత్యాల, గద్వాల, పటాన్‌చెరు, చేవెళ్ల, స్టేషన్‌ఘన్‌పూర్, ఖైరతాబాద్, బాన్సువాడ సహా దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ వర్సెస్ చేరికవర్గం మధ్య తీవ్ర అగాధం నెలకొన్నది. స్థానిక నేతల మధ్య పొసగని బంధం పోరు కుంపట్లను రాజేస్తున్నది. బయటకు సుస్థిర ప్రభుత్వమని చెప్తున్నా లోపల అస్థిర కాంగ్రెస్‌గా మారిపోయిందని, ఒకవేళ అనర్హత వేటుపడితే తమ రాజకీయ భవిష్యత్తుకు తామే సమాధి కట్టుకునట్టు అవుతుందని సదరు ఎమ్మెల్యేలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నట్టు తెలిసింది.

డీఏలు చెల్లించండి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): దసరా కానుకగా ఉద్యోగులకు పెండింగ్ డీఏలను చెల్లించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని జేఏసీ నేతలు కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి, కే రామకృష్ణ, జీ నిర్మల, రమేశ్ తదితరులున్నారు.

ఐసెట్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఐసెట్ స్పాట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదలయ్యింది. 15,16 తేదీల్లో విద్యాసంస్థల్లోనే స్పాట్ ద్వారా సీట్లను భర్తీచేస్తారు.ఖాళీల వివరాలను https://tgicet. nic.in వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి: టీఎన్జీవో

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): దీపావళిలోపు ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. మరోవైపు టీఎన్జీవో మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణగౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, మహిళా నేతలు ఉమాదేవి, శైలజ, అనురాధ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అభ్యర్థిత్వాన్ని టీఎస్ యూటీఎఫ్ ఖరారుచేసింది.

డిసెంబర్ 1న మిలిటరీ కాలేజీ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ(డెహ్రాడూన్)లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష డిసెంబర్ 1న జరగనున్నది. దరఖాస్తుల స్వీకరణ గడువు సెప్టెంబర్ 30తో ముగియగా, ఈనెల 10వరకు పొడిగించినట్టు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు.

ఎంబీబీఎస్‌కు 32 మంది గురుకుల విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ) : నీట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 32 మంది గురుకులాల విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించినట్టు సొసైటీ కార్యదర్శి రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి అభినందించారు.

పీజీఈసెట్ రెండో విడత సీట్ల కేటాయింపు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): పీజీఈసెట్ రెండో విడత సీట్లను మంగళవారం కేటాయించారు. 4,221 సీట్లు భర్తీ అయ్యాయి. 14 నుంచి 17 వరకు రిపోర్ట్ చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు సూచించారు.

గ్రూప్-1 కోసం ఒక్కో సెంటర్‌లో ఒక పోలీస్

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ఒక్కో సెంటర్‌కు ఒక్కో పోలీసు అధికారి, ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు. ఇవి గ్రూప్-1 మెయిన్ పరీక్షలకు కల్పిస్తున్న పటిష్ట బందోబస్తు. 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్ పరీక్షలను నిర్వహించనున్నారు.

విదేశీ యాత్రలు ఘనం

సాధించింది శూన్యం

- ఇప్పటికే ఐదు దేశాల్లో పర్యటించిన సీఎం
- వరుసగా టూర్లు వేస్తున్న మంత్రులు
- అత్యధిక శాతం అమెరికాకే టికెట్
- లెక్కే లేని ఢిల్లీ పర్యటనలు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): 'విదేశీ యాత్రలు ఘనం.. సాధించింది శూన్యం' అన్నట్టుగా తయారైంది మంత్రుల పరిస్థితి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలే అయినా, దాదాపు సగం మంది మంత్రులు విదేశీ టూర్లకు వెళ్లి వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండు దఫాలుగా ఐదు దేశాల్లో పర్యటించారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, తాము వృథా ఖర్చులు తగ్గించి, పొదుపుగా ప్రభుత్వాన్ని నడుపుతామని చెప్తున్న మంత్రులు ఒకరి వెంట ఒకరు విదేశీ పర్యటనలకు వెళ్లిరావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడులను ఆకర్షించడానికే విదేశీ పర్యటనలు అని చెప్పుకుంటున్నా, ఆచరణలో కొత్త పెట్టుబడులు వచ్చిన దాఖలాలు లేవనే విమర్శలొస్తున్నాయి. అంతేకాకుండా ఎక్కువ మంది అమెరికాకే వెళ్లి రావడం గమనార్హం.

ముఖ్యమంత్రి రెండుసార్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండు సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లి వచ్చారు. మొదటిసారి ఈ ఏడాది జనవరిలో.. స్విట్జర్లాండ్, బ్రిటన్, దుబాయ్‌లో పర్యటించారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్నారు. అక్కడినుంచి లండన్‌కి వెళ్లి థేమ్స్ నదిని పరిశీలించి వచ్చారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్‌పై చర్చలు జరిపారు. తర్వాత దుబాయ్‌లో పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. ఆ పర్యటనలో ఆయన వెంట మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా పాల్గొన్నారు. ఈ ఏడాది ఆగస్టులో రెండోసారి విదేశీ పర్యటనకు వెళ్లిన సీఎం అమెరికా, దక్షిణ కొరియా, దుబాయ్‌లో పర్యటించారు. ఈసారి ఆయనతోపాటు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. రెండు పర్యటనలతో వేల కోట్ల పెట్టుబడులు సాధించామని ప్రభుత్వం చెప్తున్నా, కొత్తగా ఏ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయో, అందులో ఏవి వాస్తవ రూపం దాల్చాయో చెప్పలేని పరిస్థితి. ముఖ్యంగా ఆగస్టులో జరిగిన అమెరికా పర్యటన తీవ్ర విమర్శలకు దారితీసింది. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి చెందిన స్వచ్ఛ బయోగ్రీన్ సంస్థతో ఒప్పందం అందులో ఒకటి.

మంత్రులూ.. వరుసగా టూర్లు

- మంత్రులు సైతం వరుసగా విదేశీ టూర్లకు వెళ్లివస్తున్నారు. సగటున నెలకోమంత్రి విదేశాల్లో పర్యటిస్తుండటం విశేషం.
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క దాదాపు పది రోజులపాటు అమెరికా, జపాన్‌లో పర్యటించారు. మూడు రోజుల క్రితమే తిరిగి వచ్చారు.
- పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన ఈ ఏడాది జనవరిలో స్పెయిన్‌లో పర్యటించారు. గత నెలలో బ్యాంకాక్‌కు వెళ్లి వచ్చారు.
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సీఎంతో పాటు పలు దేశాల్లో పర్యటించారు.
- రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ మేలో అమెరికాలో పర్యటించారు.
- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇప్పటికే రెండుసార్లు అమెరికాలో పర్యటించారు.

ఢిల్లీ టూర్ వయా బెంగళూరు

సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 25సార్లు ఢిల్లీకి వెళ్లివచ్చారు. గత 11 నెలల్లో ఆయన సగటున రెండు వారాలకోసారి ఢిల్లీ వెళ్లారు. మంత్రులు సైతం ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారో లెక్కలేదు. ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి ఒంటరిగా ఢిల్లీకి వెళ్లిన సందర్భం లేదనే చెప్పొచ్చు. ఒకట్రెండుసార్లు మినహా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి వెళ్లారు. వారితో పాటు ఒకరిద్దరు మంత్రులు వెళ్లడం ఆనవాయితీగా వస్తున్నది. మంత్రులు సొంత పనుల మీద ఢిల్లీకి వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మంత్రివర్గం అత్యధికంగా పర్యటించిన మూడో నగరంగా బెంగళూరును చెప్పుకోవచ్చు. ఢిల్లీ పర్యటనలో సగం కర్ణాటక రాజధాని మీదుగా జరిగాయంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వం ఏర్పడింది మొదలు.. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యేదాకా హైదరాబాద్-బెంగళూరు మధ్య విపరీతమైన రాకపోకలు సాగాయి. బెంగళూరులో ఒక మినీ అధిష్ఠానం నడిచిందని కాంగ్రెస్ వర్గాలే అప్పట్లో జోకులు వేసుకున్నాయి. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కలవడానికి రాష్ట్ర మంత్రులు వరుస కట్టారు. ఇటీవల కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత కుమ్ములాటలతో ఎదురీదుతుండటంతో ఈ ప్రయాణాలు కాస్త తగ్గినట్టు కనిపిస్తున్నాయి.

ఫలితం ఏముంది?

పెట్టుబడులు తేవడానికి, రాష్ట్ర ప్రయోజనాల కోసం, తెలంగాణ బ్రాండ్‌ను మరింత ప్రచారం చేయడానికి మంత్రులు దేశ, విదేశీ పర్యటనలు చేస్తే ఎవరూ తప్పుపట్టరు. అయితే, ముఖ్యమంత్రి సహా మంత్రుల పర్యటన వల్ల కలిగిన లాభం ఏమిటన్నదే రాజకీయ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ఇప్పటివరకు ఒక పెద్ద పెట్టుబడి కూడా రాష్ట్రానికి రాలేదని పారిశ్రామిక వర్గాలు చెప్తున్నాయి. ఢిల్లీ పర్యటనల్లో 90% కేవలం రాజకీయ ప్రయోజనాలు, పార్టీ అంతర్గత వ్యవహారాల కోసమే తప్ప తెలంగాణ కోసం కాదనే ఆరోపణలున్నాయి. బెంగళూరు పర్యటనలు పూర్తిగా రాజకీయ పర్యటనలే. ఇలా మంత్రుల పర్యటనల వల్ల అటు ప్రజాధనం వృథాకావడంతోపాటు ఇటు పాలన కుంటుపడుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం విదేశీ పర్యటనకు వెళ్లినప్పుడు పాలనా వ్యవహారాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పర్యవేక్షిస్తుంటారని, కానీ గత పర్యటనలో ముఖ్యమంత్రితోపాటు సీఎస్ కూడా వెళ్లారని గుర్తుచేస్తున్నారు. దీంతో పదిరోజులపాటు రాష్ట్రంలో పాలన పడకేసిందని, ముఖ్యమైన ఫైళ్లు అన్నీ ఆగిపోయాయని అంటున్నారు. సీఎం ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ, పాలన స్తంభిస్తున్నదని చెప్తున్నారు.

పర్యటించండి.. పెట్టుబడులు పెట్టండి

అమెరికా పర్యటనలో మంత్రి జూపల్లి పిలుపు

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): ప్రపంచస్థాయి మౌలిక వసతులతో పర్యాటకుల, పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను తీర్చిదిద్దుతున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణకు రావాలని, కొత్త ప్రదేశాలను చూసి, కొత్త అనుభూతులు, సరికొత్త అనుభవాలను పోగేసుకోవాలని ఎన్నారైలకు పిలుపునిచ్చారు. అమెరికాలో పర్యటిస్తున్న జూపల్లి మంగళవారం లాస్ ఎంజెల్స్‌లో నిర్వహించిన తెలంగాణ టూరిజం రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు, విదేశీ ప్రతినిధులు, పర్యాటకులు, అక్కడి అధికారులతో మాట్లాడారు. ప్రపంచ స్థాయి ఐటీ, ఆరోగ్య సంరక్షణ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు కేంద్ర బిందువుగా హైదరాబాద్ ఎదిగిందని వివరించారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ఎన్ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాజయ్య. చిత్రంలో సుంకె రవిశంకర్, గువ్వల బాలరాజు, ఎర్రోళ్ల శ్రీనివాస్

ఎస్సీ వర్గీకరణ పేరిట రేవంత్ మోసం

- అసెంబ్లీలో సీఎం ప్రగల్భాలు
- వర్గీకరణ అమలులో విఫలం
- ఉద్యోగాల భర్తీలో మాదిగలకు అన్యాయం
- చిత్తశుద్ధి ఉంటే ఆర్డినెన్స్ తేవాలి
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): 'వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే అన్ని రాష్ట్రాల కంటే ముందే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఢంకా బజాయించి చెప్పారు.. అమల్లో మాత్రం తాత్సారం చేస్తూ మాదిగలను మోసం చేస్తున్నారు' అని బీఆర్ఎస్ నేత, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ఎస్సీ స్థానాల్లో రెండింటిలో మాలలు, ఒకటి బైండ్ల సామాజిక వర్గానికి ఇచ్చి మాదిగలకు మెండిచెయ్యి చూపారని విమర్శించారు. మంత్రివర్గంలోనూ మాదిగలకు చోటివ్వలేదని ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, సుంకె రవిశంకర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తనతోనే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టించి చిత్తశుద్ధిని చాటుకున్నారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే తెలంగాణలోనే వర్గీకరణను అమలుచేస్తామని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తరకుమార ప్రగల్భాలు పలికారని తెలిపారు. 65 రోజులవుతున్నా ఆచరణకు ఉపక్రమించనే లేదని తెలిపారు. అగ్రవర్ణానికి చెందిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా ఉపసంఘం ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. వర్గీకరణను పక్కనబెట్టి ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ మాదిగ బిడ్డలకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ చేసేదాకా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయవద్దని డిమాండ్ చేశారు.

ఆర్డినెన్స్ ఎందుకు తేలే : సుంకె రవిశంకర్

హైడ్రా అమలు కోసం ఆర్డినెన్స్ తెచ్చిన రేవంత్ సర్కారు ఎస్సీ వర్గీకరణపై ఎందుకు తేలేదని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరిగితే డీఎస్సీలో 1,200 ఉద్యోగాలు మాదిగలకు వచ్చేవని తెలిపారు. రేవంత్‌రెడ్డి మాదిగ ద్రోహిగా మారారని మండిపడ్డారు.

మంత్రివర్గంలో చోటేది?: గువ్వల

ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తేకుండా, మంత్రివర్గంలో మాదిగలకు చోటుకల్పించకుండా సీఎం రేవంత్‌రెడ్డి ద్రోహం చేశారని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు విమర్శించారు. సిద్దిపేట జిల్లాలో ఎస్టీటీ పోస్టుల్లో ఆరు ఉంటే ఐదు మాలలకు రాగా, ఒక్కటే మాదిగలకు వచ్చిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు జాతీయస్థాయి ఉద్యమానికి సైతం సిద్ధమేనని హెచ్చరించారు.

కాంగ్రెస్ విధానం తేల్చాలి: ఎర్రోళ్ల

ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ విధానాన్ని స్పష్టంచేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలయ్యాక వర్గీకరణ జరిగితే ఏమి లాభమని ప్రశ్నించారు. మాదిగల వాటా తేల్చి నియామకాలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాదిగ ఎమ్మెల్యేలు నోరు విప్పాలని, ఎస్సీ వర్గీకరణపై రోడ్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మాదిగల ఉద్యమానికి బీఆర్ఎస్, కేసీఆర్ అండగా ఉన్నారని తెలిపారు.

సంపూర్ణ కులగణన!

- బీసీ, ఎస్సీలతోపాటు అన్ని కులాల సంఖ్యను తేల్చే యోచనలో సర్కారు
- జీఏడీ లేదా మరో శాఖ ద్వారా కులగణన
- సీనియర్ అధికారికి కులగణన బాధ్యతలు?
- రెండ్రోజుల్లో సీనియర్ మంత్రులతో భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సంపూర్ణ కులగణన చేపట్టే దిశగా సర్కారు కసరత్తు చేస్తున్నది. ఎస్సీ, బీసీ కులగణన మాత్రమే కాకుండా అన్ని కులాల వివరాలను సేకరించాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అంశాలపై మంత్రివర్గ ఉపసంఘాలు, కమిషన్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆయా వర్గాల జనాభా సంఖ్యను తేల్చేందుకు రెండు వేర్వేరు సర్వేలు చేపట్టే బదులు, మొత్తంగా కులగణన చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలో ప్రభుత్వ ఉన్నది. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సచివాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, బీసీ కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, లా సెక్రటరీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులగణనపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో అధికారులు పర్యటించి రూపొందించిన నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రభుత్వం ఇప్పటికే బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, కులగణన కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. కర్ణాటక, బీహార్, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన ఎలా చేశారు? ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు? ఆయా రాష్ట్రాల్లో ఎదురైన సమస్యలను ఎలా పరిష్కరించారు? తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. కర్ణాటకలో బీసీ కమిషన్ ద్వారా, బీహార్‌లో జీఏడీ ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్